

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 13-1-98)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈరోజు రమణజయంతి. రమణమహర్షి జ్ఞానగురువు. ఆయన జ్ఞానాన్ని బోధించినప్పటికి మీకు శరణాగతి మార్గం నచ్చితే ముందు శరణాగతిని చెప్పి తరువాత జ్ఞానాన్ని చెప్పారు. మనం శరణాగతి మార్గంలో ప్రయాణం చేసినా, విచారణ మార్గంలో ప్రయాణం చేసినా గమ్యం ఒక్కటే. రమణ మహర్షికి మనకు పెద్దతేడా లేదు. ఆయనకు అజ్ఞానము ఎలా ఉంటుందో బంధం ఎలా ఉంటుందో తెలియదు. మనకు జ్ఞానం ఎలా ఉంటుందో, మోక్షం ఎలా ఉంటుందో తెలియదు. రమణస్వామి దగ్గరకు ధనవంతులు వెళ్ళినా పేదవారు వెళ్ళినా, జంతువులు వెళ్ళినా, పక్షులు వెళ్ళినా, ఏరంగంలో పనిచేసే వారువెళ్ళినా ఎవరు వెళ్ళినా, అందరినీ ఆత్మగానే చూసేవారు గాని దేహంగా చూడలేదు. ఆయనకు కర్తృత్వభావన లేదు. అందువలన ఆయనకు దు:ఖం లేదు. మనకు కర్తృత్వ భావన ఉంది కాబట్టి మనకు దు:ఖం వస్తోంది. ఆయన తక్కువ కేటగిరికి చెందిన గురువుకాదు. గురువుకు శిష్యులని, భక్తులని ఉంటారు. రమణమహర్షికి ప్రత్యేకంగా శిష్యులు లేరు ఎందుచేతనంటే ఆయనకు ఇతరులు లేరు. జ్ఞానికి ఇతరులు ఉండరు. జ్ఞాని అంటే బ్రహ్మమే. వేరు చేసేది అహంభావన, ఐక్యం చేసేది ఆత్మభావన. ఆయనకు నిరంతరము ఆత్మభావన. ఆయన సుప్రీం కేటగిరికి చెందిన గురువు. మామూలు గురువులతో ఆయనను పోల్చటానికి వీలు లేదు.

మన అహంభావన దేహానికి పరిమితమై ఉంటుంది. మనకు ఏతలంపు వచ్చినా, ఆలోచనవచ్చినా దేహమే కేంద్రం అవుతుంది. నేను పుట్టాను అని ఎవడైతే అనుకొంటున్నాడో వాడు ఎన్నిసాధనలు చేసినా వాడికి మోక్షంరాదు అని భగవాన్ చెప్పారు. నేను పుట్టాను అంటే దేహం పుట్టింది. అంటే దేహభావన ఉన్నవాడికి మోక్షంరాదు. ఆత్మభావన ఉన్నవాడికి మాత్రమే మోక్షం వస్తుంది అని చెప్పారు. ఆత్మమన హృదయంలో ఉంది. మనకు దేహం తెలుస్తోందిగానిలోపల ఉన్నఆత్మ తెలియటంలేదు. మన అహంభావన ఎంతసేపు దేహంచుట్టూ తిరుగుతూ ఉంటుంది. దానిని సంతృప్తి పరచటానికే మనజీవితం అంతా ప్రయత్నం చేస్తున్నాము. అహంభావన తగ్గించుకోవటానికి ప్రయత్నంచేయటం లేదు. మనకు శ్రద్ధ ఉంటే, ఈశ్వరునిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే మనలోపల ఉన్న ఈశ్వరుడే ఏదేరూపంలో బయట వ్యక్తమయ్యి మన అర్హతనుబట్టి మనకు బోధిస్తాడు. అలా అవతరించిన మహాగురువులలో, మహాజ్ఞానులలో రమణమహర్షి ఒకరు. ఆయన దేహం ధరించింది శివక్షేత్రం, ఆయనబోధించినది శివక్షేత్రం. టీన్ఏజ్ చెడ్డది అని చెపుతారు. ఆ వయస్సులో వారికి సొంతంగా ఆలోచనరాదు. ఇతరులు చెప్పేదివినరు అయితే ఆవయస్సులో ఎవరికైనా భక్తికలిగితే, ఏదైనా

విషయంలో శ్రద్ధకలిగితే అదిజీవితం పొడుగునా ఉంటుంది. ఆ వయస్సులోనే రమణమహర్షికి జ్ఞానంకలిగింది.

ఆత్మవేరు, దేహం వేరు అని భగవంతుడు చెప్పాడు. అదిమనకు తెలియటంలేదు. దేహానికి పరిమితమైన బుద్ధి, ప్రకృతిగుణాలు ఎప్పుడైతే నశించాయో అప్పుడు ఆత్మవేరు, దేహంవేరు అనిస్పష్టంగా నీకు తెలుస్తుంది. మనం స్వార్ధంతో పనిచేస్తూ ఉంటే దేహబుద్ధి పెరిగిపోతూ ఉంటుంది. మనంస్వార్ధం లేకుండా పనిచేస్తూ ఉంటే దేహబుద్ధి తగ్గుతుంది, ఆత్మబుద్ధికలుగుతుంది. మీరు పూజలు, జపాలు చేయకుండానే పనిద్వారా కూడా దేవుడిని పొందవచ్చు. అలాగని పూజలు, జపాలు చేయవద్దుఅనికాదు. పూజలు, జపాలతో సంబంధం లేకుండా పనే దేవుడుగా భావించి పనిచేస్తూ వచ్చిన ఫలితాన్ని సమాజమునకుగాని, ఈశ్వరునికి అర్పిస్తే మీకు చిత్త శుద్ధి కలుగుతుంది. మనం ఏమార్గం ద్వారా ప్రయాణం చేసినా చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే జ్ఞానమును పొందగలము. భగవంతుడు లేడు, లేడు అనిచెప్పేవాడి హృదయంలోకూడా భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు ఉన్నాడు అనిచెప్పేవాడి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. వాడి హృదయంలోనూ ఉన్నాడు, వీడి హృదయంలోనూ ఉన్నాడు. కాని తేడా ఏమిటి అంటే ఉన్నాడు అనుకొనే వాడికి ఈజన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయిన భగవంతుని తెలుసుకోవాలి అనే బుద్ధికలుగుతుంది. అప్పుడు ప్రయత్నం ప్రారంభిస్తాడు. భగవంతుడు లేడు అనుకొనేవాడికి ఆబుద్ధికలుగదు అందువలన అసలు ప్రయత్నమే చెయ్యడు. ప్రయత్నం చేస్తే ఈజన్మలో కాక పోయినా వందజన్మల తరువాత అయినా భగవంతుడు తెలుస్తాడు. అందులో సందేహంలేదు. మీరు చేసిన సాధన, మీరు చేసిన మంచి నాకు ఎందుకు రాబోయే జన్మలో మీకే ఇచ్చేస్తాను అని కృష్ణుడు చెప్పాడు. మీరు పెద్ద కష్టపడనక్కరలేదు మీరు సన్యాసులు అయిపోనక్కరలేదు. భగవంతుడు మనకు చేతులు ఇచ్చాడుకాబట్టి ఆచేతులతో మనకు చేతనయినంత మంచిచేయటం, మనస్సు ఇచ్చాడుకదా ఆమనస్సుతో భగవంతుని ధ్యానంచేయటం. అప్పుడు మనస్సు అణిగిపోతుంది. మీభక్తిని అంతా పూజకే పరిమితం చేయవద్దు. మనకు క్రమశిక్షణ కలగటం కోసం, మనస్సు అణగటంకోసం, మనకు అంతర్ దృష్టి కలగటం కోసం పూజ, జపం, ధ్యానం మన పెద్దలుఏర్పాటు చేసారు అనే విషయం మర్చిపోవద్దు.

కోరికలను తగ్గించుకోమని బుద్ధుడు చెపుతూ ఉండేవాడు. ఎందుచేతనంటే మనిషి వెంట నీడ ఎలావస్తుందో అలాగేమనిషికి ఏరకమైనకోరిక ఉన్నా దానికూడా దుఃఖం వస్తుంది. కోరిక మనకు మొదట తీపిగా ఉన్నా చివరకు ఆముదంలా అవుతుంది. ఎవరి సమక్షంలో కూర్చొంటే శాంతి, కాంతి వర్షిస్తోందో, జ్ఞానం సంపాదించాలనే కాంక్ష కలుగుతోందో వారితో సహవాసంచేస్తే అది సంపద అన్నారు అచార్యులవారు. నీ ఇంట్లో ఉన్నడబ్బు సంపదకాదు. సత్పురుషులతో, నీకంటేచైతన్నస్థాయి ఎక్కువ ఉన్నవారితో సహవాసము నీకు దొరికితే అది సంపద. అసలు నీకు చైతన్యస్థాయి తక్కువగా ఉంది. నీకంటే చైతన్నస్థాయితక్కువ ఉన్నవారితో, నిరంతరము నీమనస్సును బాహ్యాముఖం చేసేవారితో నీకు సహవాసం దొరికితే అది ఆపద అని ఆచార్యులవారు చెప్పారు. భగవంతుడు అనేవాడు ఒకడు

ఉన్నాడు అని నిశ్చయానికి వస్తే నీవు బాగుపడినట్లేలెక్క. ఎందుచేతనంటే వాడు ఈరోజుకాకపోయిన రేపు అయినా సాధన ప్రారంభిస్తాడు. బైబిల్ దేవుడిని యెహోవా అంటారు. అంటే నేను ఉన్నాను అని అర్థం. భగవాన్ ఏమిచెప్పారు అంటేనీవు అలాగ ఉండకు, ఇలాగ ఉండకు, అదిగా ఉండకు, ఇదిగా ఉండకు నీవు యెహోవా అవుతావు అన్నారు. కానిమనం ఏదోఒకదానితో తాదాప్యం చెందుతూ ఉంటాము. భగవాన్ ద్వైతం, అద్వైతం గురించి అధ్భుతంగా చెప్పారు. నీకు దేహంతో తాదాప్యం ఉంటే ద్వైతం దేహంతో తాదాప్యం లేకపోతే అది అద్వైతం అనిచెప్పారు. నీకుదేహంతో తాదాప్యం ఉన్నంతకాలం ద్వైతం తప్పదు. దేవుడు వేరు, నేనువేరు అనేబుద్ధితప్పదు నీవు దేహంతో తాదాప్యం వదిలివేస్తే అది అద్వైతం.

కొంత మందికి మహిమలు అధ్భుతాలు అంటే చాలా ఇష్టంభక్తిని మహిమలకే పరిమితం చేస్తున్నారు. కోరి తెచ్చుకొన్న సిద్దుల వలన ప్రమాదం. అవి నిన్ను బంధిస్తాయి. కొంత మందికి జ్ఞానంకలిగిన తరువాత కూడా మహిమలు వాటి అంతట అవేవస్తాయి. వాటి వలన ప్రమాదం లేదు. నిజమైన శాంతి నీకు కలిగితే అద్భుతాలవైపుకు, మహిమలవైపుకు నీ మనస్సు వెళ్ళదు. అద్భుతాలవలన, మహిమలవలన నీకు మోక్షంరాదు. ఆత్మజ్ఞానం వలన నీకు మోక్షం కలుగుతుంది. అందువలన జ్ఞానాన్ని గమ్యంగా పెట్టుకోవాలి. కృష్ణుడు ఉపాధి ద్వారా అనేక మహిమలు జరిగాయి, రాముడి ఉపాధి ద్వారా మహిమలు జరుగలేదు. అంత మాత్రం చేత రాముడు తక్కువ దేవుడు, కృష్ణుడు ఎక్కువ దేవుడు అనికాదు. లోపల ఉన్న సద్వస్తువు సమానమే. దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి ఒకో దేహం ద్వారా ఎక్కువ అద్భుతాలు జరుగుతాయి. ఆత్మ జ్ఞానము కలిగి ఉండటమే నిజమైన సిద్ధి. మానవుడు సుఖాన్ని కోరుకోవటంలో తప్పలేదు. మీ స్వరూపం సుఖమే కదా అందువలన సుఖాన్ని కోరుకొంటున్నావు. అది తప్పకాదు అన్నారు భగవాన్. సుఖాన్ని కోరుకోవటంలో తప్పలేదు. దానిని నీ హృదయంలో వెతకటం మానేసి సుఖం ఎక్కడలేదో అక్కడ వెతుకు చున్నావు. అది తప్పు. సుఖం కోసం లోకంలో వెతకటం తప్పు అన్నారు భగవాన్. వస్తువు ఎక్కడయితే ఉందో అక్కడ వెదుకు ఈ జన్మలోకాకపోయినా రాబోయే జన్మలో అయినా అది నీకు దొరుకుతుంది. అది ఎక్కడ లేదో అక్కడ వెతుకుచున్నారు. జీవుడు చేసే పొరపాటు అది అని చెప్పారు. జ్ఞానాన్ని సంపాదించటం కోసం ముందు నీవు ప్రయత్నం చెయ్యి. జ్ఞానం కలిగిన తరువాత మహిమలు వస్తే ప్రమాదం లేదు. జ్ఞానం రాకుండా నీ సాధనా బలం వలన మహిమలు వస్తే అప్పుడు నీవు మాయలోపడే అవకాశం ఉంది. వాటితో నీకు తాదాప్యం వస్తుంది. నేను ఇన్ని మహిమలు చేస్తున్నాను. లోకంలో నాకు ఇంత గౌరవం ఉంది అని అహంభావన పెరిగిపోతుంది. ఇది అంతా నిజం క్రింద నీకు అనిపిస్తుంది. నీకు తెలియకుండా దేహాభిమానం పెరిగిపోతుంది. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం తగ్గాలి. దేహాభిమానం తగ్గకపోతే మోక్షం వచ్చే అవకాశం లేదు. మనం పనిద్వారా, మాటద్వారా, ఆలోచన ద్వారా దేహాభిమానం తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి.

నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. నీవు సాధన చేయటం వలన భగవంతుడు కొత్తగారాడు.

నీవు సాధన చేయకపోయినా మొద్దబ్బాయిగా ఉన్నా కూడా నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. నీవు సాధన చేయటం ఎందుకంటే నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకు తెలియకుండా ఏ బలహీనతలు అయితే నీకు అడ్డువస్తున్నాయోవాటిని తొలగించుకోవటానికే సాధన. కొంత మంది వారికి ఉన్న తెలివిని, గౌరవాన్ని సొంతానికే ఉపయోగించుకొంటారు. సమాజానికి ఉపయోగించరు. వాటిని సమాజం కోసం ఉపయోగిస్తే అది కూడా సాధనే నీచేత చూడబడే ప్రపంచం, చూసే జీవుడు, దేవుడికి పూజలు చేసేనీవు, పూజింపబడే దేవుడు ఇవి అన్నీకూడా చైతన్యమునందు కల్పితములు మాత్రమే. మన నమ్మకాలను, విశ్వాసములను ఊడగొట్టటానికి ప్రయత్నం చేయటంలేదు, అంతిమ సత్యానికి మన కళ్ళు తెరిపించటానికి ఇవి అన్నీ చెపుతున్నారు. నీ స్వరూపం నీకు తెలియకుండా నీవు దేవుడిని తెలుసుకోలేవు. మాకు దేవుడు కనిపించాడు అని కొంత మంది చెపుతారు. కనిపిస్తే కనిపించవచ్చును. ఆదేవుడిని చూసే నీ మనస్సు ఎంత నిజమో ఆదేవుడు కూడా అంత నిజం. నీవు ఎవడో నీకు తెలిస్తే దేవుడు ఎవడో నీకు తెలియబడతాడు. భక్తి కూడా అవసరం. భక్తి లేకుండా జ్ఞానంరాదు. భక్తిని జ్ఞానమాత అన్నారు భగవాన్.

మహాజ్ఞానియొక్క అనుగ్రహంలో, మహాత్ముల అనుగ్రహంలో ఎప్పుడయినా పడితే పడాలని పడకపోయినా ప్రమాదవశాత్తు పడితే మీరు అందరూ పులి నోటిలో పడ్డ మాంసపు ముక్కలు అన్నారుభగవాన్. పులి నోటిలో పడిన మాంసపు ముక్కను బయటకు లాగుదామన్నా అదిరాదు. అదిలోపలకే వెళ్ళిపోతుంది. అలాగే మీకు తెలియకుండా మహాత్ముల అనుగ్రహంలో పడినా మీరు పులి నోటిలో పడ్డ మాంసపు ముక్కలే అంటే మీరు బయటకు వచ్చే అవకాశము లేదు, మీరు తరించబడతారు. ఏ వస్తువును పొందటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావో ఆ వస్తువుకు సంబంధించిన స్పష్టత నీకు ఉండాలి. దాని మీద ప్రేమ లేకుండా నీవు మెకానికల్‌గా చేసే సాధనవలన అది తెలియబడదు. ఏ వస్తువునయితే పొందాలో దాని గురించి శ్రవణం చెయ్యి, దాని గురించి మననం చెయ్యి. మనస్సులో మినహాయింపులు వద్దు. ఏ వస్తువును పొందటానికి కృషి చేస్తున్నావో త్రికరణములతోటి ఆవస్తువును పొందటానికి ప్రయత్నం చెయ్యి.

నీ హృదయంలో ఉన్న చైతన్యం మాటకు, మనస్సుకు అందదు. ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడ అది తెలియబడుతుంది. నీ బుద్ధితో దానిని తెలుసుకోవటానికి నీ బుద్ధికి అది ఒక object కాదు. నీ బుద్ధిని ఆచైతన్యంలోలయింప జేస్తే చైతన్యానుభవం కలుగుతుంది. నీచేతితో పట్టకారును పట్టుకోగలవుగాని పట్టకారునీచేతిని పట్టుకోవాలి అనుకున్నా అదిపట్టుకోలేదు. నీహృదయంలో ఉన్న చైతన్యమును బుద్ధితో పట్టుకోవాలి అనుకోవటం ఎటువంటిది అంటే పట్టకారుతో నీ చేతిని పట్టుకోవాలను కోవటం వంటిది. మనస్సు అణిగిపోతే ఒక గంట ఒక క్షణం లాగ వెళ్ళిపోతుంది. కాలము, కోరికలు, రాబోయే జన్మకు కారణములు అన్నీ కూడా మనస్సులో ఉన్నాయి. మనస్సు అణిగిపోతే కాలం అణిగిపోతుంది, అన్నీకూడా అణిగిపోతాయి. జ్ఞాని మాత్రమే కాలాతీతుడు, కామాతీతుడు అవ్వగలడు. దేహబుద్ధి ఉన్నవాడు ఈరెండింటికి లోబడి ఉండవలసిందే.

దుఃఖకారణములు నీకు పుట్టకతోనే వస్తాయి. దుఃఖం వచ్చినప్పుడు ఆ దుఃఖ కారణము నీలోపల ఉంది అని నీకు తెలుస్తుంది, అంత వరకు నీకు తెలియదు. జబ్బు నీకు తెలియకుండా ఉండటంకంటే నీకు తెలియటం మంచిది. జబ్బుతెలిస్తే వైద్యం చేయించుకొంటాము. అలాగే నీలోపల ఉన్న దుఃఖకారణము నీకు తెలియటం మంచిది. తెలిస్తే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. లోపల ఉన్న దుఃఖకారణం నీకు తెలియటం మంచిది. తెలిస్తే దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. లోపల ఉన్న దుఃఖ కారణం నశిస్తే దుఃఖం నశిస్తుందిగాని దుఃఖకారణం నశించకపోతే ఎన్ని జన్మలు ఎత్తినా దుఃఖం నశించదు, నిన్ను వెంటాడుతూ ఉంటుంది.

ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తూ ఉంటే వారు విమర్శిస్తున్నారు. అనుకొంటున్నాము. అలా అనుకోవద్దు. మిమ్మల్ని ఎవరైతే విమర్శిస్తున్నారో వారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు వాడు లోపల ఉండి కెలుకుతాడు. మీలో ఎంత సహనం ఉందో, మీకు ఎంత నిగ్రహం ఉందో చూడటం కోసం వారిచేత విమర్శింపజేస్తాడు. మనం ఏమనుకొంటున్నాము. అంటే ఇది అంతా దేవుడికి సంబంధం లేదు, వీడు విమర్శిస్తున్నాడు అనిఅను కొంటున్నాము. కాని చేయించేది భగవంతుడే ఆ ఉపాధి ద్వారా ఎందుకు విమర్శిస్తున్నాడు అంటే మీకు ఎంత సహనం ఉందో మీకు తెలియాలి. విమర్శలు రాకపోతే మీకు సహనం ఉందోలేదో మీకు తెలియదు. మీలో సహనం ఉందో, లేదో మీకు తెలిస్తే అప్పుడు సాధన ప్రారంభిస్తారు. అహంభావన పోగొట్టుకోవటం కోసం సాధన చేస్తున్నావు నిన్ను ఎవరైనా విమర్శిస్తే నీవు ఏ వస్తువునయితే పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావో దానికి వారు కూడా సహకరిస్తున్నారు అని నీకు తెలియటం లేదు. భక్తుల జీవితాలలో ఉన్న కష్టాలు ఇతరులు జీవితాలలో ఉండవు. భక్తులకు కష్టాలు ఎందుకు వస్తాయి అంటే వారిలో సూక్ష్మరూపంలో ఏమైనా సంస్కారములు ఉంటే వాటిని కెలికి బయటకులాగి వారిచేత అనుభవింపజేసి వారిని పరిశుద్ధులుగా చేసి ఆ జన్మలోనే మోక్షం ఇచ్చేయటం కోసం ఈశ్వరుడి యొక్క ప్రణాళిక అది. మిగిలనవారు ఏమనుకొంటారు అంటే వారికే కష్టాలు వస్తున్నాయి మనం బాగానే ఉన్నాము అనుకొంటున్నారు. వీరి కష్టాలు, దుఃఖాలు అన్నీ వాయిదా పడతాయిఅన్న సంగతివారికి తెలియటం లేదు.

మీ బట్ట మీద పురుగు పాకుతోంది. అనుకోండి. మీ బట్టమీద పురుగుపాకుతోంది అని ఎవరైనా చెపితే వారి మీద మీకు కోపం వస్తుందా అని అడిగారు. కోపంరాదు. మీలో ఈబలహీనత ఉంది తొలగించుకోండి అని చెపితే వారి మీదమీకు కోపం వస్తోంది ఎందుకు ? మీ బట్ట మీద పురుగుపాకుతోంది అని చెప్పినందుకు మీరు సంతోషిస్తారు, వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉంటారు, వారిని తిట్టరు. కాని మీలో ఈ దోషం ఉంది తొలగించుకోండి అని చెపితే మీకు కోపం వస్తోంది. దానికి ఎందుకు కోపం రావటం లేదు. దీనికి ఎందుకు కోపం వస్తోంది. చెప్పండి ఆపురుగుతో మీకు తాదాత్మ్యం లేదు. అందువలన వెంటనే దానిని తీసి అవతలపడవేస్తారు. మీలో ఉన్న బలహీనతతో మీకు తాదాత్మ్యం ఉంది అంతే కాదు అదే నిజం అనుకొంటున్నారు. దానిని తొలగించుకోమని ఎవరైనా చెపితే వారి మీద మీకు కోపం వస్తుంది మీ కంటికి కనిపించేది ఒక్కటే నిజం అని అనుకోవద్దు

మీ కళ్ళకు కనిపించని నిజాలు ఎన్నో ఉన్నాయి. ఆత్మ, చైతన్యం అంటే మీరు బుజ్జిగాడు, బుజ్జిగాడు అనుకోకండి పెద్దగోడ మీద చిన్న చిలకబొమ్మ వేసాము అనుకోండి ఆ బొమ్మ గోడ అంతా ఉండదు. గోడలో కొంత భాగంలో ఉంటుంది. అలాగే విశాలమైన చైతన్యంలో, ఆత్మలో ఈసూర్యుడు, ఈచంద్రుడు, ఖండాలు, ఈసృష్టి అంతాకూడా కొంత భాగం మాత్రమే ఉంటుంది. భగవాన్ అంటూ ఉండేవారు మీకు ఎంతసేపు క్రియేషన్ గొడవేకాని క్రియేటర్ గొడవలేదు. అనేవారు. ఇతరులలో ఉన్న దోషాలను చూడవద్దు అప్పుడు ప్యూరిటీ పెరుగుతుంది. ఇతరులలో ఉన్నదోషాలు చూడడం భగవంతుడు పాపులకు అప్పగించాడు. మీరు భక్తులు కదా ఆ గొడవ మీకు ఎందుకు ? ఇతరులలో ఉన్న దోషాలను చూడటం ఎప్పుడైతే మానివేసారో అప్పుడు భక్తి పెరుగుతుంది. భక్తి ఎప్పుడైతే పెరిగిందో మీరు కొంచెం కొంచెం ఆత్మవైపుకు జరుగుతూ ఉంటారు. అప్పుడు మీకు ఆత్మానుభవం కలుగుతుంది.

జ్ఞానం అంటే గీతలో నాలుగు శ్లోకాలు కంఠస్తం చేయటం జ్ఞానంకాదు. మహాత్ములు చెప్పిన నాలుగు మాటలు కంఠస్తం చేయటం జ్ఞానం కాదు. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. నీ హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికిరావటం జ్ఞానం. ఇప్పుడు నీకు దేహం ఏవిధంగా అయితే అనుభవంలో ఉందో అలాగే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి రావటం జ్ఞానం.

## (పెన్నాడలో శ్రీనాన్నగారి ప్రవచనము, 8-1-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఆత్మ మనహృదయంలో ఉంది. మన మనస్సును తీసుకొని వెళ్ళి ఆత్మలో నిలబెట్టి అందులో మనస్సు కరిగిపోయేవరకు చూస్తాడు వాడు గురువు, వాడు ఆచార్యుడు. తాను బోధిస్తూ, తానుభోదించినది తాను ఆచరిస్తూ, మిమ్మల్ని కూడా ఆచరింపచేసేవాడు ఆచార్యుడు. తను ఏవస్తువు గురించి బోధ చేస్తున్నాడో ఆవస్తువు మీ చేతికి అందేటట్లు చేసేవాడు ఆచార్యుడు. ఇప్పుడు మీ శరీరం ఎక్కడ ఉంటే అక్కడ మీరు ఉన్నారు అనుకొంటున్నారు. మీరు శరీరమే అయితే మీరు పెన్నాడలో ఉన్న మాట నిజం. మీరు శరీరం అనుకొన్నప్పడు మీరు ఆత్మగానే ఉన్నారు. మీరు మనస్సు అనుకున్నప్పడు మీరు ఆత్మగానే ఉన్నారు, కాని మీ మనస్సులో ఉన్న వికారముల వలన, మీరు ఆత్మ అన్న సంగతి మీకు తెలియటం లేదు. మీరు ఆత్మ అయినప్పటికి మీరు మనస్సుగా ఉండటం వలన, దేహంగా ఉండటం వలన, వికారములు వస్తున్నాయి. ఆవికారముల వలన బయట విషయాలకు ఆకర్షింపబడుతున్నారు. బయట ఏమీ లేదు. అంతా లోపలే ఉంది. లోపల ఉన్నదే బయట కనిపిస్తుంది. మీలో బలహీనత లేకపోతే, చెడులేకపోతే ప్రపంచంలో చెడు ఉన్నా నిన్ను ఆకర్షించదు. నీలో మంచి ఉంటే బయట ఉన్న చెడు నిన్ను ఆకర్షించదు.

పక్షులుగాలిలో ఎగురుతున్నాయి, చేపలు నీటిలో ఈదుతున్నాయి, మనుషులు భూమిమీద తిరుగుచున్నారు. మనకు జ్ఞానంలేకపోతే పక్షులు ఎంతో, చేపలుఎంతో మనంకూడా అంతే, వాటికి